RNI No: APTEL /25/A2860

# సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 43 | పేజీలు : 4 | శుక్రవారం 14 ఆగస్టు 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



## మోసగాళ్లతో జాగ్రత్త!

- ఆన్‌లైన్‌లో తిరుమల శ్రీవారి సేవలు బుక్ చేస్తున్నారా?
- నకిలీ వెబ్‌సైట్లు, వాట్సాప్ సందేశాలపై భక్తులకు టీటీడీ అలర్ట్
- శ్రీవారి దర్శనం, వసతి పేరుతో ఆన్‌లైన్‌లో డబ్బులు వసూలు చేస్తున్న మోసగాళ్లు
- గత రెండేళ్లలో 259 నకిలీ వెబ్‌సైట్ల గుర్తింపు, నిర్వాహకులపై కేసులు నమోదు
- బుకింగ్‌ల కోసం అధికారిక వెబ్‌సైట్, యాప్ మాత్రమే వాడాలని విజ్ఞప్తి
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టీకరణ

## సైన్యం కన్నా రైల్వేలపైనే కన్ను..

- ఐఎస్ఐ వ్యూహం మార్చిందా?
- భారత రైల్వే నెట్‌వర్క్‌ను లక్ష్యంగా చేసుకుని ఐఎస్ఐ భారీ కుట్ర
- దాడులే కాకుండా, తప్పుడు సమాచారంతో భయాందోళనలు సృష్టించే పన్నాగం
- సైనిక స్థావరాల కంటే ఎక్కువగా రైల్వేలపై సమాచారం సేకరణ
- స్వాతంత్ర్య దినోత్సవాన్ని లక్ష్యంగా చేసుకుని ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో దాడులకు ఆస్కారం
- రూ.3,000 వంటి స్వల్ప మొత్తానికే ఏజెంట్ల నియామకం



## వ్యక్తిగత దూషణలొద్దు

వారి ట్రాప్‌లో పడొద్దు: పవన్ దిశానిర్దేశం



**అమరావతి:**
సోషల్‌మీడియాలో విభిన్నమైన అంశాలపై మాట్లాడే సమయంలో, పోస్టులు పెట్టేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తమ పార్టీ శ్రేణులకు జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. అనవసర విషయాలపై ఇష్టానుసారం భాషను ఉపయోగించడం మంచిది కాదన్నారు. ప్రసార మాధ్యమాలు, సోషల్‌మీడియాలో మాట్లాడే సమయంలో పార్టీ నేతలు, జన సైనికులు, వీర మహిళలు కచ్చితంగా పార్టీ నిర్దేశించిన మార్గదర్శకాలు పాటించాలని సూచించారు. "వ్యక్తిగత విషయాలు, వ్యక్తిగత దూషణల జోలికి వెళ్లొద్దు. పార్టీల సిద్ధాంతాలు, మార్గదర్శకాలకనుగుణంగానే స్పందించాలి. ఏదైనా విషయం మీద మాట్లాడే సమయంలో ఆవేశాలకు లోనుకావద్దు. అసభ్య పదజాలాన్ని వాడవద్దు.



## సీదిరి అప్పలరాజుకు భారీ ఊరట.. బెయిల్ మంజూరు

- సీదిరి కొడుకు చేసినన బైక్ యాక్సిడెంటులో ఒక వ్యక్తి మృతి
- కేసులో ఆధారాలు తారుమారు చేసేందుకు యత్నించారంటూ సీదిరిపై కేసు
- 23 రోజులుగా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న సీదిరి

## యుద్ధప్రాతిపదికన పోలవరం

- సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు
- పోలవరం, వెలిగొండ ప్రాజెక్టుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- 89.9 శాతం మేర పోలవరం సివిల్ పనులు పూర్తయినట్టు వెల్లడి
- ప్రాధాన్యతా క్రమంలో 36 ప్రాజెక్టులు పూర్తి చేయాలని నిర్ణయం
- గండి పోశమ్మ ఆలయాన్ని పరిరక్షిస్తూ పనులు చేపట్టాలని ప్రత్యేక సూచన
- రాష్ట్రంలో వర్షపాతం, భూగర్భ జలాలపైనా సమావేశంలో చర్చ



**అమరావతి**
ఆంధ్రప్రదేశ్‌లో కీలకమైన సాగునీటి ప్రాజెక్టుల పనుల పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పోలవరం, వెలిగొండ సహా రాష్ట్రంలోని ప్రాధాన్యతా ప్రాజెక్టుల పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుల వారీగా జరుగుతున్న పనుల వివరాలను జలవనరుల శాఖ అధికారులు ఆయనకు నివేదించారు. పోలవరం ప్రాజెక్టులో నిన్నటి వరకు 89.9 శాతం సివిల్ పనులు పూర్తయ్యాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఎడమ కాలువ పనులు యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నాయని, ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్-1, గ్యాప్-2 పనులను శరవేగంగా చేపట్టినట్టు తెలిపారు. ఇటీవల 14 లక్షల క్యూసెక్కుల భారీ వరద ప్రవాహం వచ్చినప్పటికీ, పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా కొనసాగించామని నివేదికలో పేర్కొన్నారు. పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, పలు కీలక సూచనలు చేశారు. డ్యామ్ సైట్ వద్ద రోడ్ల వంటి మౌలిక వసతుల నిర్మాణాన్ని - మిగతా 3లో



## నేను కాంగ్రెస్ నాయకులను విమర్శించలేదు

- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి
- కాంగ్రెస్ పార్టీలో బయటి నుంచి వచ్చిన వారి పెత్తనం ఎక్కువయిందన్న రాజగోపాల్ రెడ్డి
- రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలతో పార్టీలో రేగిన దుమారం
- తాను పార్టీ నేతలను విమర్శించలేదన్న మునుగోడు ఎమ్మెల్యే



## హద్దుల్లో ఉంటే మంచిది

- రాజగోపాల్‌కు పీసీసీ చీఫ్ కౌంటర్
- రాహుల్ గాంధీ నాయకత్వంలోనే పనిచేస్తానని స్పష్టం చేస్తూనే.. పార్టీలో బయటి వ్యక్తుల ఆధిపత్యం పెరుగుతోంది
- సీఎం అయినా, సామాన్య కార్యకర్త అయినా కాంగ్రెస్‌లో ఒకే నిబంధన వర్తిస్తుంది
- సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజగోపాల్‌రెడ్డి హద్దుల్లో ఉండాలి అని స్పష్టం

**యాదాద్రి భువనగిరి:**
తెలంగాణ కాంగ్రెస్‌లో మరోసారి అంతర్గత అసంతృప్తి స్వరం వినిపించింది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తాను కాంగ్రెస్‌లోనే ఉన్నానని, రాహుల్ గాంధీ నాయకత్వంలోనే పనిచేస్తానని స్పష్టం చేస్తూనే.. పార్టీలో బయటి వ్యక్తుల ఆధిపత్యం పెరుగుతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే సమయంలో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్.. పార్టీకి ఎవరూ అతీతులు కాదని స్పష్టం చేస్తూ.. సీఎం అయినా, సామాన్య కార్యకర్త అయినా కాంగ్రెస్‌లో ఒకే నిబంధన వర్తిస్తుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజగోపాల్‌రెడ్డి హద్దుల్లో ఉండాలి అని స్పష్టం చేశారు

## ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో గ్లోబల్ సమ్మిట్



- స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో స్మార్ట్ కార్డుల పంపిణీ
- స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయం
- క్యూర్ పరిధిలోని ఆటోలను ఈవీలుగా మార్చేందుకు ప్రత్యేక పథకం అమలు
- వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించి, వాటి సాగును పెంచేందుకు రైతులకు అవగాహన కల్పించాలని నిర్ణయం

**హైదరాబాద్**
తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం ముగిసింది. రాష్ట్ర సచివాలయంలో మూడు గంటలపాటు జరిగిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గత ఏడాది కంటే ఘనంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. క్యూర్ పరిధిలోని ఆటోలను ఈవీలుగా మార్చేందుకు ప్రత్యేక పథకం అమలు చేయనున్నారు. సమావేశం అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ కుమార్, ఎంపీ రఘురామిరెడ్డితో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. గతంలో రాష్ట్రంలో 2.81కోట్ల మంది రేషన్‌కార్డు లబ్ధిదారులుండగా.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా 62 లక్షల రేషన్ కార్డులను జారీ చేసిందని తెలిపారు. దీంతో ఆ సంఖ్య 3.42 కోట్లకు చేరిందన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు - మిగతా 3లో

శుక్రవారం 14 ఆగస్టు 2026

సీమ వార్త
సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

# నేతన్నల....సొమ్ము నాకేశారు..!!

**నియోజకవర్గం లో చేనేతలను అన్యాయం చేసిన చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత.**

**నేతన్న కష్టం తెలియని వారికి చేనేత పథకాల అర్హత ఎలా వచ్చింది.**

**నిజమైన నేతన్నలకు న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదు ఉషశ్రీ.**

**చేనేతల పథకాల అర్హత పై వెంటనే సమగ్ర విచారణ జరపాలి.**





**సోమందేపల్లి ఆగస్టు 14 సీమ వార్త సాయంకాలం**

మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట శుక్రవారం చేనేత కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ చేనేత కార్మికులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ మంత్రి, శ్రీ సత్యసాయి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ ఒక చీరను తయారు చేయాలంటే ఎంత కష్టం ఉంటుందో ఒక నేతన్న కే తెలుసునని రోజంతా మగ్గం ముందు కూర్చొని చేతుల నొప్పిని భరిస్తూ కళ్లకు శ్రమను లెక్కచేయకుండా తన కుటుంబాన్ని పోషించుకోవడానికి రాత్రి పగలు కష్టపడుతూ ఒక్కో దారాన్ని అల్లుకుంటూ ఒక చీరను తయారు చేస్తాడని నేతన్న చేతుల్లో రూపు దిద్దుకునే ప్రతి చీర వెనుక అతని చెమట, శ్రమ, కన్నీరు, కుటుంబం భవిష్యత్తు దాగి ఉంటుందని అలాంటి నిజమైన చేనేత కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందాల్సింది పోయి చేనేతల పేరుతో అనర్హులకు ప్రయోజనాలుఅందుతున్నాయనే ఆరోపణలు రావడం అత్యంత బాధాకరమ్మాన్నారు. టీడీపీ కార్యకర్తలకు ఒకే కుటుంబంలో నలుగురికి చేనేత పథకం అందించారని మద్యం షాపుల్లో పనిచేసే వారికి పంచర్ షాపుల్లో పనిచేసే వారికి చిప్స్ అమ్ముకునే వారికి ప్రైవేట్ స్కూల్ టీచర్లకు కూడా చేనేత పథకాల ప్రయోజనాలు అందించారని వస్తున్న ఫిర్యాదులపై ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మగ్గం మీద కూర్చొని చీర నేసే నిజమైన నేతన్నకు పథకం దక్కకపోతే మద్యం షాపులో పనిచేసే వారికి ఇతర వృత్తుల్లో ఉన్న వారికి చేనేత పథకాలు ఎలా అందుతున్నాయని ప్రశ్నించారు. ఒకే కుటుంబంలో నలుగురికి ప్రయోజనం అందుతున్నప్పుడు ఏళ్ల తరబడి మగ్గాన్ని నమ్ముకుని జీవిస్తున్న నిజమైన చేనేత కుటుంబాలు ఎందుకు పక్కన పెట్టబడుతున్నారని చేనేత కార్మికుల కోసం ఉద్దేశించిన పథకాలు రాజకీయ కార్యకర్తలకు పంచే పథకాలు కావు అవి మగ్గాన్ని నమ్ముకుని జీవిస్తున్న నిజమైన నేతన్న కుటుంబాలకు అండగా నిలవాల్సిన పథకాలు నిజమైన చేనేత కార్మికులను గుర్తించాలి అనర్హులను తొలగించాలి ఒకే కుటుంబానికి అక్రమంగా లబ్ధి చేకూర్చిన వ్యవహారాలపై విచారణ జరపాలన్నారు. చేనేత పథకాల లబ్ధిదారుల జాబితాను బహిర్గతం చేయాలని అర్హులైన ప్రతి నేతన్నకు ప్రభుత్వ సాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. చేనేత కార్మికుల కష్టాలను వారి హక్కులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని నేతన్న చెమటకు విలువ దక్కే వరకు నిజమైన చేనేత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు చేనేతల పేరుతో జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించే వరకు మా పోరాటం కొనసాగుతుందని చెప్పారు. మగ్గం ఆగకూడదు.. నేతన్న కుటుంబం ఆకలితో ఉండకూడదు.! నేతన్న కష్టానికి గౌరవం దక్కాలి! చేనేత పథకాలు నిజమైన చేనేతలకే అందాలి..! నేతన్నకు న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదని ఉషశ్రీ చరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గజేంద్ర, డీసీ అశోక్, గోవిందమ్మ గారి శ్రీనివాసులు, గట్టు మంజునాథ్, వేణు,కంబాలప్ప, నరసింహమూర్తి, ఆంజనేయులు నాయక్,దేవాంగం బండా ప్రసాద్,లాలే పల్లి రవి, ఇమాం వలి,గోవింద రెడ్డి, గుడి పల్లి కళ్యాణ్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.



# నాడు చెప్పాను...
# నేడు చేసి చూపించాను..!!

**కాలువపల్లిలో రోడ్డు నిర్మాణంపై మంత్రి సవిత.**

**2 ఏళ్లు కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు**

**అన్ని గ్రామాల్లోనూ రహదారుల నిర్మాణం.**

**కాలర్ ఎగరేసేలా సీఎం చంద్రబాబు పాలన.**

**అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లండి.**

**కూటమి నాయకులకు, కార్యకర్తలను సూచన.**

**జగన్ హయాంలో ఒక్క రోడ్డయినా వేశారా..?.**

**పంచాయతీల వారీగైనా చర్చ సిద్ధం.**

**తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదు.**

**వైసీపీ నాయకులకు మంత్రి సవిత హెచ్చరిక**



**పరిగి ఆగస్టు 14 సీమ వార్త సాయంత్రం.**

'రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నాం... అభివృద్ధిపై పంచాయతీ స్థాయిలోనైనా చర్చకు సిద్ధంగా ఉన్నాం... కల్లుతాగిన కోతిలా కుప్పిగెంతులు వేస్తూ... అభివృద్ధిపై, సంక్షేమంపై తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదు ' అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ,చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత హెచ్చరించారు. అయిదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క రోడ్డయినా వేశారా..? అని నిలదీశారు. ఆరోజు చెప్పాను...ఈరోజు చేసి చూపించాను అంటూ పరిగి మండలం కాలువపల్లి గ్రామంలో రూ. 42 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణంపై మాట నిలబెట్టుకున్నట్లు తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు కాలర్ ఎగరేసేలా సీఎం చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారని ఆనందం వ్యక్తంచేశారు. పరిగి మండలంలో రూ.5.40 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజలు, ప్రారంభోత్సవాలను మంత్రి సవిత శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభల్లో ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ, ఫ్రీ బస్, ఉచిత ఇసుక, పెన్షన్ల పెంపు వంటి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నామన్నారు ప్రతి గ్రామంలోనూ బీటీ రోడ్లు, సీసీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లను, గురుకులాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. నూతన నిర్మాణాలు సైతం చేపట్టామన్నారు. త్వరలో నూతన పెన్షన్లు, ఇళ్ల స్థలాలు సైతం అందజేయనున్నట్లు తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు కాలర్ ఎగరేసేలా సీఎం చంద్రబాబునాయుడు పాలిస్తున్నారని మంత్రి సవిత కొనియాడారు.

**తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదు**

అయిదేళ్ల పాలనలో కనీసం ఒక్క రోడ్డయినా నిర్మించారా..? అని మంత్రి సవిత ప్రశ్నించారు. దోచుకోవడం, దాచుకోవడమే లక్ష్యంగా వైసీపీ పాలకుల పాలన సాగిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పాలన సాగిస్తున్నామన్నారు. వైసీపీ పాలన, రెండేళ్ల కూటమి పాలనలో పంచాయతీల్లో జరిగిన అభివృద్ధిపైనా చర్చకు సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. సీఎం చంద్రబాబు పాలనపైనా, అభివృద్ధి, సంక్షేమంపైనా తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కళ్లు తాగిన కోతిలా కుప్పిగెంతులు వేస్తున్న వైపీపీ నేతలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమంపై ప్రజల్లో చర్చ జరిగేలా కూటమి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ప్రతి కుటుంబానికి రాష్ట్రాభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషిని వివరించాలని మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు.

**కాలువపల్లి వాసులకిచ్చిన మాటను నిలబెట్టుకున్నాను**

ఎన్నికల ముందు కాలువపల్లి గ్రామస్తులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నానని , రోడ్డు నిర్మించిన తరవాతే గ్రామానికి వస్తానని చెప్పిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ... ఆరోజు చెప్పాను...ఈరోజు చేసి చూపించాలను అంటూ కాలువపల్లి గ్రామంలో రూ.42 లక్షతో నిర్మించనున్న నూతన బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అన్ని గ్రామాల్లోనూ రహదారులు నిర్మిస్తున్నామన్నారు. పరిగి మండలంలో పర్యటన సందర్భంగా రూ.5.40 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజలు, ప్రారంభోత్సవాలను మంత్రి చేశారు. శ్రీరంగరాజుపల్లి పంచాయితీ పాపిరెడ్డిపల్లి గ్రామానికి రూ.కోటితో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. గ్రామంలో రూ.7 లక్షలతో నిర్మించిన ఎన్టీఆర్ సృజల స్రవంతి తాగునీటి కేంద్రాన్ని ప్రారంభించారు. శ్రీరంగరాజుపల్లి తాతయ్య దర్గా దగ్గర నుంచి చెర్లోపల్లి గ్రామం వరకు రూ. 4.11 కోట్లతో చేపట్టిన బీటీ రోడ్డు పనులకు మంత్రి సవిత భూమి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# మాటల్లో కాదు... చేతల్లో వైద్యం మార్పు..!!

**....పేదల వైద్యానికి మరింత మెరుగైన సేవలతో భరోసా.**

**....కొత్త ఓపీ నమోదు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి సత్యకుమార్**

**...డాక్టర్ల సేవలుపై, శానిటేషన్ గురించి రోగులనే అడిగిన మంత్రి.**

**...మహిళలు, పురుషులు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ఓపీ కౌంటర్లు.**

**ప్రభుత్వ ఆసుపత్రికి రూ.2.10 కోట్ల ఆధునిక పరికరాలు.**

**ఏపీ ఆరోగ్య వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్.**

**ధర్మవరం ఆగస్టు 14 సీమ వార్త : సాయంత్రం.**

ధర్మవరం ప్రాంతీయ ఆసుపత్రిలో పేదలకు మరింత వేగవంతంగా, సౌకర్యవంతంగా, నిరంతరాయంగా వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపీ నమోదు కేంద్రాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య ఆరోగ్య శాఖామాత్యులు, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి పేద రోగికి తక్కువ సమయంలో, ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందించాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. గతంలో ఒకే ఓపీ కౌంటర్ ఉండటంతో రోగుల రద్దీ, వేచి ఉండే సమయం పెరిగేదని, ముఖ్యంగా మహిళలు, పురుషులు, వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు ఎదుర్కొనేవారని తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే ఉద్దేశంతో కొత్త ఓపీ కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ధర్మవరం ఏరియా ఆసుపత్రికి రోజువారీగా సుమారు 700--800 మంది రోగులు వైద్య సేవలు పొందుతున్న నేపథ్యంలో ఒపీ విభాగాన్ని విస్తరించడం ద్వారా రోగుల రద్దీని క్రమబద్ధీకరించి, వేచి ఉండే సమయాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. కొత్త ఓపీ నమోదు కేంద్రంలో మహిళలు, పురుషులు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక ఓపీ కౌంటర్లు, ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. గతంలో రోగులు ఎండలో నిలబడి వేచి ఉండాల్సిన పరిస్థితులు ఉండేవని, ప్రస్తుతం వారికి అవసరమైన వేచి ఉండే సౌకర్యాలు, ఓపీ రిజిస్ట్రేషన్‌కు అనువైన వసతులు కల్పించినట్లు చెప్పారు. గతంలో ఉన్న పాత ఓపీ కౌంటర్‌ను కూడా ఐపీ కౌంటర్‌గా మార్చి వినియోగంలోకి తీసుకొచ్చామని తెలిపారు. ఒపీ కౌంటర్, బయోమెడికల్ వేస్ట్ రూమ్, క్యాంటీన్ సమీపంలోని గతంలో వినియోగంలో లేని ఖాళీ స్థలాన్ని సద్వినియోగం చేసుకుని అదనపు గదిని నిర్మించినట్లు, ఈ నిర్మాణ పనులకు పేషెంట్స్ కేర్ ఫండ్స్ ద్వారా సుమారు రూ.11.48 లక్షలు ఖర్చు చేసినట్లు వివరించారు. ఒపీ కు వచ్చే ప్రతి ఒక్కరూ అభా ఐడి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మంత్రి సూచించారు. దీని ద్వారా భవిష్యత్తులో రోగి వైద్య చరిత్ర, గతంలో నిర్వహించిన పరీక్షలు, వైద్యులు సూచించిన మందులు, ఇతర ఆరోగ్య వివరాలు ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డుగా అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఒకసారి రోగి రికార్డు డిజిటల్‌గా నమోదైతే, భవిష్యత్తులో అదే రోగి ఆసుపత్రికి వచ్చినప్పుడు గత వైద్య చరిత్రను సులభంగా పరిశీలించవచ్చని చెప్పారు. ఉదాహరణకు గతంలో ఎక్స్‌రే వంటి పరీక్ష చేయించుకున్న రోగి మళ్లీ వచ్చినప్పుడు అవసరం లేకుండానే పాత రికార్డులను పరిశీలించే అవకాశం ఉంటుందని, తద్వారా అనవసరమైన పరీక్షలు, ఖర్చులు, రేడియేషన్‌కు గురయ్యే పరిస్థితులను తగ్గించవచ్చని వివరించారు. ఆధార్, మొబైల్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి అవసరమైన వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో రోగులకు ఒపీ సేవలు మరింత సులభతరం అవుతాయని మంత్రి తెలిపారు. ఇటీవల కొత్తగా ఐదుగురు వైద్యులు, ఐదుగురు సీనియర్ రెసిడెంట్లు అందుబాటులోకి రావడంతో రోగులకు వైద్య సేవలు మరింత విస్తరించాయని చెప్పారు. ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెరిగేలా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర సిబ్బంది సేవలు అందిస్తున్నారని, ఆసుపత్రి పనితీరులో ఇంకా మెరుగుదల తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏరియా, సెకండరీ స్థాయి ఆసుపత్రులపై ప్రజల్లో సంతృప్తి స్థాయి గతంలో సుమారు 60--62 శాతం ఉండగా, ప్రస్తుతం అది 76--80 శాతానికి పెరిగిందని మంత్రి తెలిపారు.






ధర్మవరం ఏరియా ఆసుపత్రికి గత రెండేళ్లలో సుమారు రూ.2.10 కోట్ల విలువైన ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మంత్రి తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా అరుదుగా అందుబాటులో ఉండే లాపరోస్కోపిక్ సర్జరీలు ధర్మవరం ఏరియా ఆసుపత్రిలో నిర్వహించే స్థాయికి వైద్య సదుపాయాలను తీసుకొచ్చామని చెప్పారు. ధర్మవరం ప్రాంతంలోని డయాలసిస్ రోగులు గతంలో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఏరియా ఆసుపత్రిలో 10 పడకల డయాలసిస్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని మంత్రి తెలిపారు.అదే విధంగా ధర్మవరం నుంచి నేత్రదానం చేసే వారి సంఖ్య అధికంగా ఉండటం తనకు ఎంతో సంతోషంగా ఉందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ధర్మవరం నుంచి నేత్రదానం చేసిన వార్తలు తరచుగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా బ్రెయిన్ డెడ్ కేసుల్లో అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెంచాలని, ఒక బ్రెయిన్ డెడ్ వ్యక్తి అవయవదానం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉందని తెలిపారు. ధర్మవరం ఏరియా ఆసుపత్రిలో కొత్తగా పూర్తయిన భవనాన్ని మరింత అభివృద్ధి చేసి ఎన్ సి హెచ్ వార్డుగా వినియోగించేందుకు ప్రతిపాదనలు పంపినట్లు మంత్రి తెలిపారు. ధర్మవరం ఏరియా ఆసుపత్రిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తున్న సూపరింటెండెంట్ తిప్పే నాయక్‌తో పాటు ఏపీఎం ఎస్ఐడీసీ , హెచ్ డి ఎస్ సభ్యులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది సహా ఆసుపత్రిలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేస్తేనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను ప్రజలకు మరింత చేరువ చేయడం, పేదలకు ఉచితంగా, నాణ్యమైన వైద్యం అందించడం, వేగవంతమైన సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీవో రాంభూపాల్ రెడ్డి, హాస్పిటల్ సూపరింటెండెంట్ తిప్పేంద్ర నాయక్, సిఎస్ ఆర్ఎంఓ. డాక్టర్. హరి శ్రీనివాస్, హెచ్ డి ఎస్ కమిటీ సభ్యులు ఏపీఎంఎస్ఐడిసి డిఈఈ నవీన్, డిప్యూటీ డిఎంహెచ్ఓ భాగ్యలక్ష్మి, డాక్టర్ నరసింహులు, డాక్టర్ సోనియా, ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పాండురంగ స్వామి ఆలయ పునఃనిర్మాణానికి శిలా పూజ చేసిన మంత్రి.





రూ.1.25 కోట్లతో పాండురంగ స్వామి ఆలయానికి పునర్వైభవం.

80 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయానికి కొత్త కళ.

పాండురంగ స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలి.

ప్రకృతి అనుకూలించి సమృద్ధిగా వర్షాలు కురవాలి.

ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్.

**ధర్మవరం ఆగస్టు 14 సాయంకాలం సీమ వార్త:** ధర్మవరం పట్టణంలోని 80 సంవత్సరాల ఘనమైన చరిత్ర కలిగిన పాండురంగ స్వామి ఆలయానికి పునర్వైభవం తీసుకువచ్చే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆలయ అభివృద్ధి, పునర్నిర్మాణ పనుల కోసం రూ. 1,25,00,000/- నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ధర్మవరం పట్టణంలోని పాండురంగ స్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన ఆలయ పునఃనిర్మాణ శిలా పూజ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డితో పాటు ఎన్డీఏ కూటమి నాయకులు, ఆలయ నిర్వాహకులు, భక్తులతో కలిసి స్వామివారిని దర్శించుకుని శిలా పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పాండురంగ స్వామి వారి ఆశీస్సులు ధర్మవరం నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలని, ప్రతి ఇంట సంతోషం, ప్రశాంతత నెలకొనాలని, పిల్లల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని పాండురంగ స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. సుమారు 80 సంవత్సరాల ఘనమైన చరిత్ర కలిగిన పాండురంగ స్వామి ఆలయం ధర్మవరం ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి, భక్తి భావాలకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. కాలానుగుణంగా ఆలయాన్ని అభివృద్ధి చేసి, పునర్నిర్మాణ పనులు చేపట్టడం ద్వారా ఆలయానికి మరింత వైభవాన్ని తీసుకురావడంతో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రూ.1.25 కోట్ల నిధులను మంజూరు చేసిందని తెలిపారు. 80 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయానికి పునర్వైభవం వస్తుందని, ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం భక్తులకు మరింత మెరుగైన దర్శన, ఇతర అవసరమైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని మంత్రి పేర్కొన్నారు. భక్తుల విశ్వాసానికి అనుగుణంగా ఆలయ అభివృద్ధి పనులను నాణ్యతతో, ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆలయాలు మన ఆధ్యాత్మిక జీవనానికి మాత్రమే కాకుండా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వానికి ప్రతీకలుగా నిలుస్తాయని మంత్రి తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఆలయాలను పరిరక్షించడంతో పాటు, భవిష్యత్ తరాలకు వాటి వైభవాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఆలయాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు అని, ఆలయాలు కేవలం ప్రార్థనా మందిరాలు మాత్రమే కాకుండా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకలుగా నిలుస్తాయని మంత్రి తెలిపారు. తరతరాలుగా ప్రజల విశ్వాసానికి కేంద్రాలుగా ఉన్న ఆలయాలను పరిరక్షించుకోవడంతో పాటు వాటి అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పాండురంగ స్వామి ఆలయ పునఃనిర్మాణం భక్తుల ఆకాంక్షలకు అనుగుణంగా విజయవంతంగా పూర్తవ్వాలని, భవిష్యత్తులో భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రావాలని మంత్రి ఆకాంక్షించారు. ధర్మవరం నియోజకవర్గ ప్రజల సంక్షేమం, రైతుల సుభిక్షం, ప్రకృతి అనుకూలత, ప్రతి కుటుంబం సుఖశాంతులతో జీవించాలనే ఆకాంక్షతో పాండురంగ స్వామివారిని ప్రార్థించినట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రకృతి అనుకూలించాలని,రైతుల జీవితాల్లో సుభిక్షం వెల్లివిరియాలని,
ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం అస్థిరంగా ఉండే పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజల సంక్షేమం, రైతుల ప్రయోజనాల దృష్ట్యా ప్రకృతి అనుకూలించాలని మంత్రి ఆకాంక్షించారు. పాండురంగ స్వామి వారి కృపతో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, సాగునీటికి, తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని, రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని కోరుకున్నారు. రైతు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, ప్రకృతి సహకారం రైతాంగానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ధర్మవరం నియోజకవర్గంలో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో జీవించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సుఖశాంతులతో, ఆరోగ్యంగా జీవించే పరిస్థితులు కలగాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, కాపు రామచంద్రారెడ్డి, ధర్మవరం ఆర్డీవో రాంభూపాల్ రెడ్డి, పూజారి శ్రీధర్ శర్మ, ఆలయ మాజీ చైర్మన్ శ్రీనివాస్, ఆలయ ఈవో నాగరత్న, ఆలయ కమిటీ సభ్యులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అందరి నోట తిరంగా మాట.





గోరంట్లలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ.

పాల్గొన్న ఎంపీడీవో, పార్టీ మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, స్టేట్ డైరెక్టర్ సోమశేఖర్.

**గోరంట్ల ఆగస్టు 14 సీమ వార్త సాయంత్రం.** ఆగస్టు 15 స్వతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం గోరంట్ల పట్టణంలో ప్రభుత్వ స్కూల్ విద్యార్థుల నేతృతంలో ఘనంగా హార్ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఎంపీడీవో కమల భాయ్, డిప్యూటీ డివైఇఓ జాన్ రెడ్డప్ప, టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, హస్తకళలా స్టేట్ డైరెక్టర్ సోమశేఖర్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి నరేష్, నిమ్మల శ్రీధర్, జనసేన మండల అధ్యక్షులు సంతోష్, మార్కెట్లో డైరెక్టర్ రవీంద్ర నాయక్, పూల గంగాధర్, మైనార్టీ నేత షామీర్ భాష తదితర నేతృతంలో పటం లోని ప్రభుత్వ బాలుర మరియు బాలికల హైస్కూల్ విద్యార్థులు జాతీయ పథకాలు చేత పట్టి పట్టణంలో ర్యాలీ నిర్వహించి అనంతరం బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కమల భాయ్, మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ దేవంగం శ్రీనివాసులు, పసుపులేటి శ్రీనివాసులు, హోటల్ చాంద్బాషా, గంగంపల్లి సుబహాన్, తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు లక్ష్మీపతి, జనసేన మండల అధ్యక్షులు సంతోష్, వృషభ దేవుడు, నరేష్, తిప్పరాజు పల్లి రాజా, డీలర్ ఎస్వి నారాయణ, రమేష్, మల్లేష్, కసిరెడ్డిపల్లి శంకర, నబి రసూల్, జనసేన నాయకులు గోవిందప్ప, శ్రీరాములు, కాలనీ శ్రీనివాసులు, వాల్మీకి సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ లో ఫ్లెక్సీ వివాదానికి ఫుల్ స్టాప్

మందకృష్ణ మాదిగ ఆదేశాలతో ఒక్కటైన నేతలు

జిల్లా ఇంచార్జి సమక్షంలో చేతులు కలిపిన పెద్దిరాజు, పుల్లయ్య



**తాడిపత్రి, ఆగస్టు 14 - సీమా వార్త సాయంత్రం:** తాడిపత్రి పట్టణంలో ఎమ్మార్పీఎస్ వ్యవ స్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశం నిర్వహించరు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇంచార్జి ముమ్మడి వరపు సుబ్బారావు హాజరయ్యారు. తాడిపత్రి నియోజకవర్గంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్దిరాజు మాదిగ, పుల్లయ్య మాదిగ మధ్య గత కొద్ది రోజులుగా ఫ్లెక్సీ వివాదం నడుస్తోంది. ఈ వివాదం మందకృష్ణ మాదిగ దృష్టికి వెళ్లడంతో ఆయన ఇరువురికి సర్ది చెప్పారు. దీంతో జిల్లా ఇంచార్జి సుబ్బారావు సమక్షంలో పెద్దిరాజు మాదిగ, పుల్లయ్య మాదిగ ఒకరినొకరు చేతులు కలుపుకొని, ఆలింగనం చేసుకుని విభేదాలకు ముగింపు పలికారు. ఈ వివాదం టీ కప్పులో తుఫాను లాంటిదని, ఇక నుండి ఎలాంటి విభేదాలు లేకుండా మందకృష్ణ మాదిగ నాయకత్వాన్ని ప్రతి గ్రామంలో బలోపేతం చేస్తామని, ప్రతి ఒక్కరూ ఆయన ఆదేశాలను పాటించి ఎమ్మార్పీఎస్ కోసం కలిసికట్టుగా పనిచేస్తామని వారు స్పష్టం చేశారు. జిల్లాలో ఎమ్మార్పీఎస్ ను మరింత బలోపేతం చేసేందుకు త్వరలోనే గ్రామ స్థాయి కమిటీలను పునర్వ్యవస్థీకరిస్తామని, మందకృష్ణ మాదిగ చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని జిల్లా ఇంచార్జి సుబ్బారావు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తిమ్మమ్మను దర్శించుకున్న కాపు నేతలు.

ప్రత్యేక పూజలు కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు నారాయణస్వామి రాయల్.

సీమ స్థాయిలో కడపలో నిర్వహించే వనభోజనాలకు సంఘ నేతలకు ఆహ్వానం.





**నంబుల పూలకుంట ఆగస్టు 14 సీమ వార్త సాయంత్రం.** నంబుల పూలకుంట మండలంలోని తిమ్మమ్మ మర్రిమాను లో తిమ్మమ్మ అమ్మవారిని రాష్ట్ర కాపునాడు అధ్యక్షులు నారాయణస్వామి రాయల్ రాష్ట్ర కాపునాడు ప్రధాన కార్యదర్శి సెగినేని పోతులూరయ్య దర్శించుకున్నారు. అనంతరం రాయలసీమ లో బలిజ సంఘం తరుపున ఏర్పాటు చేయబోతున్న కార్తీక్ వనబోజన కార్యక్రమం నకు అందరు సమష్టి గా పాల్గొని కార్యక్రమం విజయ వంతం చేయాలని కోరారు .రాబోవు రోజుల్లో బలిజలు రాజకీయం గా ఎదగటానికి అందరం ఏకమై మన ఉనికి కి చాటుకొని రాజకీయం గా ఎదగటానికి వచ్చే నాయకునికి సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరారు.పార్టీ ల కు అతీతంగా అందరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు .అనంతరం రాష్ట్ర కాపునాడు ప్రధాన కార్యదర్శి సెగినేని పోతులూరయ్య మాట్లాడుతూతిమ్మమ్మ మరిమాను అమ్మ వారి చరిత్రను ప్రపంచానికి చాటింప చేయడానికి అన్ని భాష లో ప్రచురించడానికి ఒక డోనార్ ద్వారా ముందుకు వచ్చి ప్రచురణలు దేశ రాష్ట్ర వ్యాప్తంగా వ్యాప్తిశీచే విధంగా ప్రయత్నాలు చేస్తున్నామనీ హామీ ఇచ్చారు.ఈ కార్య క్రమంలో స్థానిక బలిజ సంఘం నాయకులు నారాయణ స్వామి వెంకట నారాయణ శ్రీనివాసులు విష్ణు మూర్తి చంద్రశేఖర్ మనోహర రామచంద్రయ్య తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## జేసీ సోదరులను కలిసిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

దివాకర్ రెడ్డి ఆరోగ్యంపై ఆరా

మర్యాదపూర్వక భేటీలో మహిళా సాధికారత, నియోజకవర్గ అభివృద్ధిపై చర్చ



**తాడిపత్రి, ఆగస్టు 14 సీమా వార్త సాయంత్రం:** మాజీ మంత్రి జేసీ దివాకర్ రెడ్డిని, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డిని సింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జేసీ దివాకర్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేసీ ప్రభాకర్ రెడ్డితో తాడిపత్రి నియోజకవర్గంలో మహిళా సాధికారత కోసం చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలు, మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధి అవకాశాలు, మహిళలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి సుదీర్ఘంగా చర్చించారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. మహిళా సాధికారతతోనే కుటుంబాలు, సమాజం మరింత అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. అనంతరం తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

## కమల నేతగా చెప్తున్నా... కచ్చితంగా రాజధాని దాకా తీసుకెళ్తా.

బోయల ఎస్టి రిజర్వేషన్ పై రాజీలేని పోరాటం చేస్తా.

బిజెపి నేత, వాల్మీకి రిజర్వేషన్స్ సమితి రాష్ట్ర అధ్యక్షులు బోయ లక్ష్మీనారాయణ స్పష్టం.





**గోరంట్ల (కర్నూల్) ఆగస్టు 14 సీమ వార్త సాయంత్రం.** కర్నూలు జిల్లా డోను నియోజకవర్గం ప్యాపిలి మండలం లో నిర్వహించిన బహిరంగ సభకు మరియు ర్యాలీకి వాల్మీకి నేతలు ఆహ్వానం మేరకు సభకు మరియు ర్యాలీకి విచ్చేసిన వాల్మీకి రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు బోయ లక్ష్మీనారాయణ ఈ సందర్భంగా మాట్లాడుతూ వాల్మీకిలకు ఎస్టి రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలని డిమాండ్ చేశారు అదేవిధంగా బోయ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ ఒక్క బీజేపీ నేతగా వాల్మీకిల ఎస్టీ రిజర్వేషన్ ప్రతిపాదనను భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యదర్శి మరియు ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ దృష్టికి వాల్మీకి సమస్యలను వారి కల్పించాల్సిన ఎస్టీ రిజర్వేషన్ అంశాన్ని వారి దృష్టికి తీసుకెళ్లి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చే విధంగా తను వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ వాల్మీకి సంఘం నేతలు, , ధర్మవరం కు చెందిన వాల్మీకి రాష్ట్ర నాయకులు చెన్నూరు నరసింహులు, రాష్ట్ర నాయకులు చీమల జయ, చీమల సూరి, వాల్మీకి సోదర సోదరీమణులు మరియు తదిరులు పాల్గొన్నారు.

## ఏకలవ్య విగ్రహ ప్రతిష్ట కు నాంది.

.....నిర్మాణం కొరకు భూమి పూజ కార్యక్రమం.

పాల్గొన్న...సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవరకొండ ఉమా శంకర్, జిల్లా అధ్యక్షులు చలపతి.





**గోరంట్ల ఆగస్టు 14 సీమ వార్త సాయంత్రం.** గోరంట్ల టౌన్ ఎస్సీ హాస్టల్ మెయిన్ రోడ్ గోరంట్లలో ఆల్ ఇండియా ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షులు సాకే చిరంజీవి పాల్గొని ఎరుకల కులస్తులందరూ ఐక్య మత్యంగా ఉండి సాధన కోసం కృషి చేయాలని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమాశంకర్ జిల్లా అధ్యక్షులు పి వెంకటాచలపతి ఉపాధ్యక్షుడు గంగాధర్ జిల్లా మహిళా అధ్యక్షురాలు జి నాగలక్ష్మి మరియు గోరంట్ల టౌన్ ప్రెసిడెంట్ వైస్ ప్రెసిడెంట్ కుల్లాయప్ప పెనుగొండ నియోజకవర్గం ప్రెసిడెంట్ బాలకృష్ణ గోరంట్ల మండలం ఉపాధ్యక్షులు జి రమణప్ప గోరంట్ల మండలం సెక్రెటరీ టీచర్ నాగరాజు మరియు వెంకటేష్ అంజి రాష్ట్ర మహిళా కార్యదర్శి నాగమణి, అంజి, అనూష,గౌరవ అధ్యక్షులు స్వామి రమాదేవి ,వెంకటరాముడు, సోము, శ్రీనివాసులు, మండల ప్రెసిడెంట్ ఉయ్యాల శ్రీనివాసులు, తాను ప్రెసిడెంట్ నరసింహప్ప, అశ్వర్థప్ప,ఆది,నాగరాజప్ప, నాగన్న మరియు పూజా కార్యక్రమంలో పూజ చేసిన టిడిపి నేత గోల్డ్ షాప్ నిమ్మల శ్రీధర్ మరియు కులస్తులు పాల్గొని భూమి పూజ చేయడం జరిగినది.

సీమ వార్త సాయంకాలం

శుక్రవారం
14 ఆగస్టు 2026

# ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించవద్దు

**చట్టబద్ధంగా, శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోండి ఎస్ఐ**




సోమందేపల్లి ఆగస్టు 14 సీమ వార్త సాయంకాలం మండలంలోని ప్రజలు తమ సమస్యలను సంబంధిత ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లే సమయంలో చట్టానికి లోబడి, శాంతియుతంగా వ్యవహరించాలని ఎస్ఐ. సుధాకర్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వ కార్యాలయాల వద్ద ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, నిరసనలు నిర్వహించడం, అనధికారికంగా గుంపులుగా సమావేశమై ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగించడం చట్టపరమైన చర్యలకు దారితీస్తుందని తెలిపారు. ఏదైనా కార్యక్రమం నిర్వహించాలనుకుంటే ముందుగా సంబంధిత పోలీస్ అధికారుల నుంచి అనుమతి తీసుకోవడం తప్పనిసరి అని సూచించారు.సంబంధిత అధికారులకు మెమోరాండం లేదా వినతి పత్రంసమర్పించాల్సి ఉంటే శాంతియుతంగా, చట్ట బద్ధమైన పద్ధతిలో, పరిమిత సంఖ్యలో ప్రతినిధులతో వెళ్లి సమర్పించాలని సూచించారు.

అలాగే ఎవరినీ వ్యక్తిగతంగా దూషించడం, అవమానించడం, బెదిరించడం లేదా అనుచిత వ్యాఖ్యలు చేయడం చేయరాదన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ సమస్యలను తెలియజేయడం హక్కు అయినప్పటికీ, ఇతరుల హక్కులకు భంగం కలిగించకుండా, ప్రభుత్వ విధులకు ఆటంకం కలగకుండా వ్యవహరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.

ప్రజలు పాటించాల్సిన సూచనలు

-- ముందస్తు పోలీస్ అనుమతి లేకుండా ధర్నాలు, నిరసనలు నిర్వహించవద్దు

-- ప్రభుత్వ కార్యాలయాల వద్ద అనధికారికంగా గుంపులుగా గుమికూడవద్దు.

-- ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఎటువంటి ఆటంకం కలిగించవద్దు

-- మెమోరాండం సమర్పించేటప్పుడు శాంతియుతంగా, చట్టబద్ధంగా వ్యవహరించండి

-- వ్యక్తిగత దూషణలు, అవమానకర వ్యాఖ్యలు, బెదిరింపులకు పాల్పడవద్దు

-- సాధారణ ప్రజల రాకపోకలకు, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించవద్దు

-- పోలీసుల సూచనలు మరియు చట్టపరమైన నిబంధనలను తప్పనిసరిగా పాటించండి

నిబంధనలను ఉల్లంఘించే వారు ఏ స్థాయికి చెందిన వారైనా చట్టం ముందు అందరూ సమానమే. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ప్రజల హక్కులను గౌరవిస్తూ -- చట్టాన్ని గౌరవిద్దాం.

శాంతియుత సమాజం కోసం పోలీసులకు సహకరించాలని ఎస్ఐ తెలియజేశారు.

## కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'స్త్రీ శక్తి అమోఘం -మాజీ ఎంపీపీ మీనాక్షి రామిరెడ్డి



**అమరాపురం ఆగస్టు 14 సీమవార్త సాయంత్రం** రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణ పథకం మహిళలకు గొప్ప ఊరటనిస్తోందని అమరాపురం మండల మాజీ ఎంపీపీ, జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ సభ్యురాలు మీనాక్షి రామిరెడ్డి అన్నారు.

స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రారంభమై ఒక సంవత్సరం పూర్తి కావస్తున్న సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకం మన ప్రాంతంలోనూ విజయవంతంగా అమలవుతోందని తెలిపారు. పథకం విశేషాలు: రాష్ట్రవ్యాప్తంగా పల్లె వెలుగు నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సుల వరకు మొత్తం 8,456 బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారని తెలిపారు. ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం నెలకు సుమారు రూ. 160 కోట్ల వరకు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. మహిళల హర్షం: ప్రయాణ ఖర్చులు పూర్తిగా ఆదా అవుతుండటంతో మహిళలు, విద్యార్థినులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. మహిళల ప్రయాణాన్ని సులభతరం చేసి, వారి ఆర్థిక భారాన్ని తగ్గించడానికి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయమన్నారు ఈ గొప్ప అవకాశాన్ని మన ప్రాంతంలోని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ ఈ పథకాన్ని అందిస్తున్న ముఖ్యమంత్రికి, కూటమి ప్రభుత్వానికి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## గోరంట్లలో ఇక... ప్రతి కులాయి కి డ్యాం నీళ్లు.


రూ, 30 లక్షల ఖర్చుతో పార్నపల్లి డ్యాం నీటి తరపు రాకై పైప్ లైన్ ఏర్పాటు కు శ్రీకారం.

మంత్రి సవితమ్మ చొరవ తో గోరంట్ల ప్రజలకు తీరనున్న నీటి సమస్య.

పార్టీ కన్వీనర్ బాలకృష్ణ చౌదరి చేతుల మీదుగా పనులు ప్రారంభం..

నిర్మాణ పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్, టిడిపి నేత నిమ్మల శ్రీధర్.

హాజరైన... పార్టీ స్టేట్ డైరెక్టర్ సోమశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, కార్యదర్శి నరేష్.





**గోరంట్ల ఆగస్టు 14 సీమ వార్త సాయంత్రం.** గోరంట్ల పట్టణ ప్రజల శాశ్వత త్రాగునీటి సమస్య పరిష్కారం కోసం మంత్రి సవితమ్మ ప్రత్యేక చొరవ తీసుకొని నీటి సమస్య పరిష్కారం చేసేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేసి నూతన పైప్ లైన్ కు శ్రీకారం చుట్టి పనులు ప్రారంభించడంతో ఇప్పటికైనా శాశ్వత పట్టణ తాగునీటి సమస్య తీరబోతోందని పట్టణ ప్రజలు ఆనంధం వ్యక్తం చేస్తున్నారు. పార్నపల్లి డ్యాం నుంచి పుట్టపర్తి మీదుగా వస్తున్న సత్యసాయిబాబా నీళ్లను గోరంట్ల మండలానికి ఇదివరకే మంజూరై నీళ్లు వస్తున్న విషయం తెలిసిందే. అయితే పైప్లైన్ వ్యవస్థ ఇన్నాళ్లు అస్తవ్యస్తంగా ఉండడంతో పట్టణ వాసులకు శాశ్వత నీటి సరఫరా సమస్య అలాగే ఉండిపోయింది. ఈ సమస్యను గుర్తించిన స్థానిక నాయకులు మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, స్టేట్ డైరెక్టర్ సోమశేఖర్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, జిల్లా కన్వీనర్ నరేష్, పట్టణ నాయకులు గిరిధర్ గౌడ్, నాగే నాయక్, అజంతుల్లా, మేకల జయరాం తదితరులు మంత్రి సవితమ్మ దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధులతో ప్రత్యేక పైప్లైన్ వేయగలిగితే పట్టణ తగునీటి సమస్య పూర్తిగా తీర్చవచ్చని మంత్రి దృష్టికి తీసుకు వెళ్లడంతో దానిపై స్పందించిన మంత్రి వెంటనే స్పందిస్తూ ప్రత్యేక నిధులు మంజూరు చేయించారు. ఈ నేపథ్యంలో పై ప్లైన్ నిర్మాణ పనులను వేగ వంతంగా పూర్తి చేసేందుకు టిడిపి నేత నిమ్మల శ్రీధర్ కు బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పట్టణంలోని చిత్రావతి బ్రిడ్జ్ వద్ద మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి చేతుల మీదుగా భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా గోరంట్ల పట్టణంలో ఏర్పడిన తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు మంత్రి చొరవతో పనులకు శ్రీకారం చుట్టామని ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడమే ఎక్కువటమే ప్రభుత్వ లక్ష్యమని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కమల భాయ్, మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి, మాజీ వార్డ్ మెంబర్ ఆగిశం నాగరాజు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ దేవంగం శ్రీనివాసులు, పసుపులేటి శ్రీనివాసులు, హోటల్ చాంద్బాషా, గంగంపల్లి సుబహన్, తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు లక్ష్మీపతి, జనసేన మండల అధ్యక్షులు సంతోష్, వృషభ దేవుడు, నరేష్, తిప్పరాజు పల్లి రాజా, డీలర్ ఎస్వి నారాయణ, రమేష్, మల్లేష్, కసిరెడ్డిపల్లి శంకర, నబి రసూల్, జనసేన నాయకులు గోవిందప్ప, శ్రీరాములు, కాలనీ శ్రీనివాసులు, వాల్మీకి సోమశేఖర్ పాల్గొన్నారు.

## అగాపే ఆశ్రమంలో అన్నదానం





**యాడికి ఆగస్టు 14 సీమ వార్త సాయంకాలం** యాడికి మండలం కేంద్రం కమలపాడు రోడ్డు, రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో పేరం లక్ష్మీనారాయణ రెడ్డి 4వ వర్ధంతిని నిమిత్తమై అన్నదానం ఏర్పాటు చేశారు. ఆయన భార్య ప్రమీలమ్మ, కుమారుడు రవీంద్రనాథ్ రెడ్డి, మరియు శ్రీనివాస్ రెడ్డి, నాగార్జున, సాయి, వెంకట్ రెడ్డి, కోన రెడ్డి కుటుంబమంతా కలిసి భోజనాలు సిద్ధం చేయించి ఆశ్రమంలో వృద్ధులకు నిరాశ్రయులకు భోజనాలు వడ్డించారు. ఇందు నిమిత్తమై ఆశ్రమ ఫౌండర్ బత్తల ప్రసాద్, ఆశ్రమంలోని వారంతా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబానికి ధన్యవాదాలు తెలిపారు.

## తాడిపత్రి రూరల్‌లో పోలీసుల దూకుడు
## 16 మందిపై బైండోవర్

డీజిల్ అక్రమ విక్రయం, భూ వివాదాలు, ఈవ్ టీజింగ్ కేసుల్లో చర్యలు



**తాడిపత్రి, ఆగస్టు 14 సీమా వార్త సాయంత్రం:** తాడిపత్రి రూరల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం రూరల్ పోలీసులు దూకుడు పెంచారు. వివిధ వివాదాల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా 16 మందిపై బైండోవర్ చర్యలు తీసుకున్నట్లు రూరల్ సీఐ నారాయణ రెడ్డి తెలిపారు. బొందలదిన్నెలో డీజిల్ అక్రమ విక్రయంలో 8 మంది, తిమ్మేపల్లి, అయ్యవారిపల్లి పొలం రస్తా వివాదంలో 4 మంది, ఎర్రగుంటపల్లి భూ వివాదంలో 3 మంది, తాడిపత్రి పట్టణంలో ఈవ్ టీజింగ్ కేసులో ఒకరిపై చర్యలు తీసుకుని, తహసీల్దార్ సమక్షంలో రూ.5 లక్షల చొప్పున పూచీకత్తు బాండ్లు తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ నారాయణరెడ్డి హెచ్చరికలు జారీ చేస్తూ – శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని, ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని, భవిష్యత్తులో గొడవలకు పాల్పడితే జైలుకు పంపడమే కాకుండా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.


## గ్రామ సచివాలయంలో మాజీ సీఎం జగన్ ఫోటో......






**నంబులపూలకుంట: ఆగస్టు 14 (సీమవార్త సాయంకాలం):** మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫోటో దర్శనమివ్వడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం మారిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారికంగా ప్రస్తుత ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మాత్రమే ఫోటోలు ఏర్పాటు చేయాల్సి ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా మాజీ ముఖ్యమంత్రి ఫోటోను గ్రామ సచివాలయం వద్ద ఉంచడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాలు ప్రజలకు సంబంధించిన పరిపాలనా కేంద్రాలుగా ఉండటంతో అక్కడ అధికారికంగా ఏర్పాటు చేసే ఫోటోలు, చిత్రాలు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండాల్సి ఉంటుంది. అయితే నంబులపూలకుంట మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం వద్ద మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫోటో కనిపిస్తుండటంతో సచివాలయ సిబ్బంది నిబంధనలను ఎందుకు పాటించడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ విషయం పంచాయతీ కార్యదర్శి దృష్టికి వచ్చినప్పటికీ ఫోటోను తొలగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా ఫోటో ఏర్పాటు చేసినట్లయితే సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు గ్రామ సచివాలయాన్ని పరిశీలించి, అక్కడ ఏర్పాటు చేసిన ఫోటో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉందా లేదా అనే విషయాన్ని స్పష్టం చేయడంతో పాటు, నిబంధనలు ఉల్లంఘించినట్లయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ భగీరథ గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన.....



**గాండ్లపెంట ఆగస్టు 14 సీమ వార్త సాయంకాలం....** మండలంలోని చిన్నక్క గారి పల్లి గ్రామంలో నూతనంగా వెలసిన శ్రీ భగీరథ గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అమ్మవారిని అలంకరించి వేద పండితులు మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజా కార్యక్రమా లు నిర్వహించి ప్రతిష్టించారు. అనంతరం భక్తులు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి గంగమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలుబాగా కురవాలని, పంటలు బాగా పండాలని, అమ్మవారి కృపతో గ్రామాలన్నీ ఎల్లప్పుడూ సుఖ శాంతులతో ఉండాలని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులందరూ తీర్థప్రసాదాలుస్వీకరించారు.

ఫోటో.... అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు..

## మాగేచెరువు "చెరువుకట్ట" మీద కంపచెట్లు తొలగింపు ప్రారంభ కార్యక్రమం



**సోమందేపల్లి ఆగస్టు 14 సీమ వార్త సాయంకాలం** మండల కేంద్రంలోని మాగేచెరువు లో నేడు ఎన్డీఏ కూటమి నాయకులు ఆధ్వర్యంలో గ్రామ చెరువు కట్ట మీద ఉన్న కంపచెట్లు వల్లన రైతులు పొలాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్న విషయం మంత్రి సవితమ్మ దృష్టికి రాష్ట్ర సగర ఉప్పర కార్పొరేషన్ ఛైర్మన్ రంగేపల్లి వెంకటరమణ తీసుకురాగా రైతులు ఇబ్బందుల దృష్టిలో ఉంచుకొని అడిగిన వెంటన సంబంధిత ఇరిగేషన్ అధికారులకు 5 లక్షల రూపాయలతో "నీటి సంఘం" ద్వారా పనులు ప్రారంభించాలని ఆదేశాలు ఇవ్వడంతో శుక్రవారం మంత్రి సవితమ్మ ఆదేశాలతో మండల ఎన్డీఏ కూటమి నాయకులు రాష్ట్ర సగర ఉప్పర కార్పొరేషన్ ఛైర్మన్ రంగేపల్లి వెంకటరమణ,ఎన్డీఏ కూటమి నాయకులు మరియు నీటి సంఘం నాయకుల ఆధ్వర్యంలో భూమి, జెసిబిలకు పూజలు చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమములో మండల టీడీపీ కన్వీనర్ నడిమిపల్లి వెంకటేష్, చల్లాపల్లి రామకృష్ణ,చాకర్లపల్లి శ్రీరాములు,మాజీ సర్పంచ్ బి.నరసింహులు,జనసేన నాయకులు రంగేపల్లి నాగరాజు, ఆయుకట్ట అధ్యక్షులు తిమ్మయ్య, ఉప అధ్యక్షులు తిమ్మప్ప, సింగిల్ విండ్ అధ్యక్షులు పూల వెంకటేష్, బూత్ కన్వీనర్ దాదావలి, కొత్తపల్లి రంగ,నాయకులు కె.భాస్కర్,అల్లాభకష్,నరసింహ మూర్తి,మాల హనుమంతప్ప, కొత్తపల్లి అంజి,ఫీల్డ్ అసిస్టెంట్ రంగేపల్లి రామాంజినేయులు, కొత్తపల్లి హనుమంతు,భీమప్ప తదితరులు పాల్గొన్నారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881